క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



చిట్టూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి

పెద్దవడుగూరు: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చిట్టూరు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంట సాగు చేసిన రైతులు ప్రస్తుతం వాతావరణంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అధిక సాంద్ర పద్ధతిలో పత్తి పంట సాగు చేయు విధానం పై అవగాహన కల్పించారు. క్లోరో ఫైరీ ఫాస్ వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో పత్తి పరిశోధన సంస్థ నోడల్ అధికారి వలర్మతి, ఏఓ మల్లీశ్వరి, ఎంపీఈఓ భాగ్య, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 32వ వార్డులో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. టీడీపీ నాయకుడు నారాయణస్వామి, వార్డు కౌన్సిలర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఎమ్మార్పీకే విక్రయించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

గార్లదిన్నె: ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియను ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలను ఏడీఏ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆయన గురుఆగ్రో ఏజెన్సీస్,లక్ష్మీ నరసింహ ఎరువులు, మన గ్రోమోర్ సెంటర్‌లో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీబీటీ ద్వారా రైతుల వేలిముద్రలు, ఆధార్ అప్‌డేషన్‌తో ఎరువులు విక్రయించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. డీలర్ షాపులో స్టాక్, ఫిజికల్ స్టాక్ రిజిష్టర్ ఒక్కటే ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని గురువారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులు, సిబ్బంది హాజరు రికార్డులు పరిశీలించారు. అనంతరం అన్ని విభాగాలను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది పని తీరు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి ఆదేశించారు.

పెట్రోల్ బంకు పరిశీలన

యాడికి: మండల కేంద్రంలోని గుత్తి రహదారిలో డింబర్ డిపో, వేరుశనగ ఆయిల్ మిల్లు మధ్యలో నిర్మాణ దశలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బంకును నిర్మించాలని నిర్వాహకులకు సూచించారు. బంకుకు వచ్చే వారికి తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ సుంకన్న, సీఎస్‌డీటీ మారుతీ ప్రసాద్ రెడ్డి, ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్‌ఓలు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తిమ్మమ్మ మాతకు ప్రత్యేక పూజలు



అలంకరణలో తిమ్మమ్మ మాత

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో తిమ్మమ్మ మాతకు కార్తీక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భజన కార్యక్రమాలు చేశారు.

మాలధారులకు రైళ్లు కరువు



- ఇబ్బందులు పడుతున్న అయ్యప్ప, భవానీమాలధారులు
- జిల్లా మీదుగా శబరిమలైకు ఒకే రైలు
- విజయవాడ వెళ్లే రైళ్లకు వందల్లోనే వెయిటింగ్ లిస్ట్
- ప్రత్యేక రైళ్లు నడపాలంటున్న మాలధారులు

గుంతకల్లు: కార్తీకమాసంలో వివిధ స్వాములను కొలుచే భక్తులు మాలను ధరిస్తుంటారు. ఈ మధ్య కాలంలో ఒక్క గుంతకల్లు నియోజవర్గంలోనే దాదాపు 15 వేలకు మందిపైగా భక్తులు మాలధారణ స్వీకరించారు. అయితే ఇరుముడి సమర్పించడానికి వెళ్లే సమయంలో మాలధారులకు సరైన రైళ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో అయ్యప్ప, శివ, భవానీ, తిరుమల వెంకన్న, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి, షిర్డీసాయి మాలధారులు వేలాది మంది ఉన్నారు. ముఖ్యంగా అయ్యప్ప మాలధారులకు జిల్లా మీదుగా కేవలం ఒక్క రైలు మాత్రమే ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక విజయవాడ వెళ్లే భవానీ మాలధారులకు రైళ్లు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్ట్‌లు ఉండటంతో చేసేది ఏమీ లేక ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

అయ్యప్పల కష్టాలు వర్ణనాతీతం..

శబరిమలై వెళ్లాడానికి అనంతపురం జిల్లా మీదుగా ప్రస్తుతం ఒక్క రైలు మాత్రమే ఉంది. పూనే-కన్యాకుమారి-పూనే (16381/82) మధ్య నడిచే పూనే ఎక్స్‌ప్రెస్ రైలు జిల్లాలోని గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి రైల్వేస్టేషన్లతో పాటు వైఎస్సార్ కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల మీదుగా రాకపోకలు సాగిస్తుంది. ఈ రైలు గుంతకల్లు జంక్షన్ నుంచి రోజూ ఉదయం 9:50 గంటలకు బయలుదేరుతుంది. దీంతో ఈ రైలుకు భలే డిమాండ్. ఈ రైలు టిక్కెట్ దొరికితే స్వామి దర్శనం చేసుకున్న భాగ్యంగా భావిస్తారు. ఇదిలా ఉండగా రైల్వే యాజమాన్యం అయ్యప్పస్వామి భక్తుల కోసం గుంతకల్లు డివిజన్ మీదుగా మూడు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఇటీవల చర్యలు చేపట్టింది. అయితే ఈ రైళ్లు ఒక ట్రిప్ మాత్రమే కావడంతో మాలధారులకు ఏ మాత్రం సరిపోవు. ఇవే రైళ్లు రోజూ రెండు నెలల పాటు నడిపితే బాగుండేదని మాలధారులు అభిప్రాయపడుతున్నారు.

స్లీపర్ కోచ్‌ల సంఖ్య పెంచాలి..

ఇక భవానీమాలధారులు విజయవాడ వెళ్లాడానికి రైళ్లు ఉన్నప్పటికి టిక్కెట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు జంక్షన్ మీదుగా రోజు సాయంత్రం భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు హుబ్లీ నుంచి నర్సాపూర్ వెళ్లే అమరావతితో పాటు అర్ధరాత్రి హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు వారంలో 4 రోజుల పాటు నడిచే వాస్కోడిగామా నుంచి భువనేశ్వర్ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. ఇక అనంతపురం మీదుగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ధర్మవరం-మచిలీపట్నంతో పాటు వారం మూడు సార్లు నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. అయితే ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు నెలల ముందు టిక్కెట్ బుక్ చేసుకున్నప్పటికీ టిక్కెట్లు దొరకవు. డిసెంబర్ నెలలో స్పెషల్ రైళ్లు నడపడంతో పాటు ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న రైళ్ల స్లీపర్ కోచ్‌ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

60 రోజులకు కుదించారు..

టూరిస్టులకు వెళ్లే ప్రయాణికులు, మాలధారులు వారి గమ్యస్థానాలకు చేరుకువడానికి ముందే ప్లాన్ చేసుకుని టిక్కెట్లు బుక్ చేసుకునేవారు. ఇక మాలాధారులకు వారి ఇరుముడి సమర్పించే తేదీ పక్కగా ఉంటుంది. టిక్కెట్లను నాలుగు నెలలు ముందే బుక్ చేసుకునేవారు. అయితే ఇప్పుడు అ పరిస్థితి లేదు. ఇటీవల రైల్వే బోర్డు టికెట్ బుకింగ్ చేసుకునే 120 రోజుల వ్యవధిని కేవలం 60 రోజులకు కుదించారు. దీంతో ట్రెన్ టిక్కెట్ దొరకడం గగనం అపోయింది. కేవలం సామాన్య ప్రజలకు రైలు ప్రయాణం దూరం చేయాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం కొత్త కొత్త పోకడలతో ముందుకు సాగుతోంది. అందులో భాగంగానే చాలా ప్యాసింజర్ రైళ్లను ఎత్తివేశారు. ప్రసుత్తం నడుపుతున్న ప్యాసింజర్ రైళ్లను స్పెషల్ ప్యాసింజర్ పేర్లతో అధిక రేట్లకు తిప్పుతున్నారు. ఇక ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఏసీ కోచ్‌ల సంఖ్యను పెంచారు. అంతేకాకుండా తాత్కల్, స్పెషల్ తాత్కల్ పేర్లుతో టిక్కెట్ రేట్లు అమాంతం పెంచి ప్రయాణికుల నడ్డి విరిస్తున్నారు.

మరిన్ని రైళ్లు నడపాలి



దాదాపు ఏడేళ్లుగా అయ్యప్పమాల ధరిస్తున్నాను. అయితే గుంతకల్లు నుంచి శబరమలైకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. పూనే ఎక్స్‌ప్రెస్ రైలు గమ్యస్థానం నుంచే రద్దీగా వస్తుంది. దీంతో మాకు స్లీపర్ టిక్కెట్లు దొరికే పరిస్థితి లేదు. మాలధారుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని కనీసం ఈ సీజన్‌లోనైనా స్పెషల్ రైళ్లు నడపాలి.

– పురుషోత్తం, అయ్యప్ప మాలధారుడు, గుంతకల్లు

నాలుగు నెలలు ముందే బుక్ చేసుకునేవాళ్లం



మా అన్నతో కలిసి గత 5 ఏళ్లుగా భవానీ మాలను ధరిస్తున్నాను. విజయవాడకు వెళ్లాడానికి నాలుగు నెలల ముందే టిక్కెట్లు బుక్ చేసుకునే వాళ్లం. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వచ్చే నెల 23వ తేదీ విజయవాడకు వెళ్లాలి. ఇంకా టిక్కెట్లు దొరకలేదు. దీంతో ఒక రోజు ముందు అధిక ధర చెల్లించి తాత్కల్ టిక్కెట్ తీసుకోవాలి. అది కూడా టికెట్ దొరుకుతుందనే గ్యారెంటీ లేదు.

– రామాంజనేయులు, భవానీమాలధారుడు, గుంతకల్లు

నెట్టికంటుడి సేవలో మాజీ ఎంపీ



ఆలయ సన్నిధిలో గోరంట్ల మాధవ్ దంపతులు

గుంతకల్లు రూరల్: హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కుటుంబ సమేతంగా గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు, వారికి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు పంపిణీ చేశారు.

విత్తన వేరుశనగకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు రూరల్: రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులు విత్తన వేరుశనగ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వాతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్థ ఎకరా ఉన్న రైతులకు 30 కిలోల బ్యాగు, ఎకరా ఉన్న రైతులకు రెండు బ్యాగులు, ఎకరా పైగా పొలం ఉన్న రైతులకు మూడు బ్యాగులను అందజేస్తామన్నారు. వేరుశనగ క్వింటాల్ ధర రూ.9,600 ఉండగా, 40 శాతం రాయితీ పోగా రైతులు రూ.5,760 చెల్లించాన్నారు. రైతులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్, డెత్, బర్త్ సర్టిఫికెట్ల మార్పులు, చేర్పులపై ఆరా తీశారు. ఉదయం 8 గంటల్లోపు సర్వర్లు బాగా పని చేస్తాయని, ఆ లోపు విధుల్లోకి వచ్చి మార్పులు, చేర్పులు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే ఇంటి పన్ను, వెకెంట్ ల్యాండ్ పన్ను, ట్రేడ్ లైసెన్స్, వాటర్ టాక్స్ వంటివి వసూలు చేయాలని ఆదేశించారు. వాటర్ టాక్స్, ప్రాపర్టీ టాక్స్ వంద శాతం వసూలు చేయాలన్నారు.

గండికోట రిజర్వాయర్ సందర్శన



రిజర్వాయర్‌ను సందర్శించిన ఎస్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ చివరి సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు వైఎస్సార్ జిల్లాలోని గండి కోట రిజర్వాయర్‌ను గురువారం సందర్శించారు. విద్యార్థులు రిజర్వాయర్ వద్ద వివిధ సాంకేతిక, నిర్మాణాల విభాగాలను పరిశీలించారు. రిజర్వాయర్ రెండు కరువు పీడిత జిల్లాలకు తాగునీటిని ఎలా సమర్థవంతంగా సరఫరా చేస్తోందో ఇంజినీర్లు వివరించారు. ఈ విద్యా విజ్ఞాన సందర్శన సివిల్ ఇంజినీరింగ్ రంగంలో ఆచరణాత్మక అంశాలను స్థిరమైన నీటి వనరుల నిర్వహణలో ఆనకట్ట మౌలిక సదుపాయాల ప్రభావాన్ని తెలియజేసిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘుబాబు, ఇంజినీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు దుకాణాల్లో చోరీ

తాడిపత్రి రూరల్: స్థానిక కడప రోడ్డులోని సిమెంట్ దుకాణం, ఐరన్ షాపు, రేకుల షాపు, హోటల్‌లో గురువారం తెల్లవారుజామున దుండగుడు చొరబడి రూ.51,800 అపహరించుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా పుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. గురువారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించిన దుకాణదారుల ఫిర్యాదు మేరకు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది అక్కడికెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



తాడిపత్రిలో ధర్నా చేస్తున్న నాయకులు



గుంతకల్లులో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు/గుంతకల్లు రూరల్/గుత్తి/పుట్లూరు/గార్లదిన్నె/శింగనమల/పామిడి/బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఎం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తోందా అన్న అనుమానం ఉందన్నారు. ఎక్కడ చూసినా అరాచకాలు, అత్యాచారాలు, దాడులు, అక్రమ అరెస్టు పేరుతో రాష్ట్రంలో అరాచక పాలన తాండవిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. ఉచిత ఇసుక ప్రజలకు అందుబాటులో లేదన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీకి తెరలేపిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, ప్రజా వ్యతిరేక పాలనకు చరమ గీతం పాడేందుకు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయా మండలాల్లో తహసీల్దార్లకు అందజేశారు.



శింగనమలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట



గుంతకల్లులో మాట్లాడుతున్న డాక్టర్ చక్రవర్తి



పెద్దవడుగూరులో క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/పెద్దవడుగూరు: ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని గురువారం గుంతకల్లు మండలం బెంచికొట్టాల పీహెచ్‌సీ ఆస్పత్రి వద్ద ఆయన ప్రారంభించారు. ఈ నెల 14 నుంచి వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ మూడు రకాల (రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్) పరీక్షలు చేస్తారన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని చిన్నవడుగూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు అమర్‌నాథ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ , సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పేరుతో 'తమ్ముళ్ల' బురిడీ

పామిడి: బీమా పేరుతో అమాయకులను బురిడీ కొట్టిస్తూ తెలుగు తమ్ముళ్లు టీడీపీ సభ్యత్వ నమోదు చేయడం ఎంతవరకూ సబబని పామిడిలోని 10వ వార్డు వాసి బోయ వెంకట రమణ ప్రశ్నించారు. గురువారం తాను ఇంట్లో లేని సమయంలో అమాయకురాలైన భార్య నాగరత్నను ప్రీమియం కడితే లక్షల రూపాయల్లో బీమా డబ్బు వస్తుందంటూ స్థానిక టీడీపీ నాయకులు నమ్మించారన్నారు. ఇది నమ్మిన నా భార్య నాతోపాటు నా తల్లి బోయ లలితమ్మకు రూ.200 తీసుకొని టీడీపీ సభ్యత్వం చేయించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు అని తెలిసీ ఎలా టీడీపీ సభ్యత్వం ఇచ్చారంటూ ఆయన టీడీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యత్వం రద్దుపరచి డబ్బులు వెనక్కు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అధ్యాపకుడికి సన్మానం

పామిడి: పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో గురువారం ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో ఉత్తమ కెమెస్ట్రీ ఉపన్యాసకుడు రమేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖామంత్రి లోకేష్ చేతులమీదుగా ఇటీవల ఉత్తమ అవార్డు అందుకున్న రమేష్‌కుమార్‌ను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ ఛైర్మెన్ మొహియుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కనకదాస జయంతి వేడుకలకు తరలిరండి'

గుంతకల్లుటౌన్: అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 18న నిర్వహించే కనకదాస జయంత్యుత్సవాలకు నియోజకవర్గంలోని కురుబలు భారీగా తరలిరావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బీరప్ప గుడిలో కురుబ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్యుత్సవ కరపత్రాలను సంఘం పెద్దలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, ఈశ్వరయ్య, వశికేరి, రామప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి'

తాడిపత్రి అర్బన్: చిన్ననాటి నుంచే విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులకు 2కే రన్ పోటీలను నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



గుత్తిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి



బీకేఎస్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీలు వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా



గుంతకల్లు మండలం దోసలుడికిలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



తాడిపత్రిలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాల్లో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతి సందర్భంగా జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీలు, వ్యాస రచన, వకృత్వ, క్రీడలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. పిల్లలు చాచా నెహ్రూపై పాటలు పాడి అలరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని గ్రంథాలయాల్లో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారులు మాట్లాడుతూ లైబ్రరీల్లో అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులతో మహిళలు, ఉద్యోగులు, క్రీడాకారులు, అన్ని వర్గాల ప్రజలు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించి పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచు కోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరు గ్రంథాలయంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



యల్లనూరులో బాలల దినోత్సవం నిర్వహిస్తున్న గ్రంథాలయ లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి



తాడిపత్రిలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు లక్ష దీపోత్సవం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శుక్రవారం లక్ష దీపారాధనోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ క్రిష్ణయ్య గురువారం తెలిపారు. ఉదయం గణపతిపూజ, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, బిల్వార్చన వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి లక్షదీపారార్చన, జ్వాలాతోరణ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటల్లోపు భక్తాదులు దేవాలయంలో నూనె, ఒత్తులు సమర్పించాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలి

గుత్తి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు ముఖ్య భూమిక పోషించాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారుపై సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి చేయాల్సిన అత్యవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు ఏఏ వీధులలో అవసరమో గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేష్‌బాబు, అప్పా వెంకటేష్, చిన్న ఆంజనేయులు, మజ్జిగ గోపాల్, పాపన్న, భరత్‌కుమార్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఎంఈఓ రవీనాయక్, శిక్షకుడు శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..కేసు నమోదు

యాడికి: యువతి అదృశ్యం కావటంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్ రెడ్డి కూతురు శైలజ(24) గురువారం ఉదయం తమ బంధువుల గ్రామమైన యాడికి మండలం చంద్రాయుని పల్లికి వెళ్లింది. సాయంత్రం అక్కడ నుండి ఎక్కడికో వెళ్లింది. యువతి తండ్రి రామ్మోహన్ ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.